# వరద బాధితులకు అండగా ప్రభుత్వం



కొమరగిరిలో బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



కొత్తలంక వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

**ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్**

**ఐ.పోలవరం:** వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని కొమరగిరి గట్టువారిపేటలో ముంపునకు గురైన 128 బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడానికి కిలో కంది పప్పు, కిలో ఉల్లిపాయలు, 25 కేజీల బియ్యం, నూనె, బంగాళాదుంపలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ విజయ చాముండేశ్వరి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కలిదిండి కృష్ణంరాజు, ఏలూరి ఆదినారాయణ, దొమ్మేటి ప్రసాద్, మోర్త చిన్నా, సఖిలే పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**147 కుటుంబాలకు నిత్యావసరాల అందజేత**

**తాళ్లరేవు:** పిల్లంక పంచాయతీ పరిధిలోని కొత్తలంక గ్రామంలోని 147 మంది వరద బాధిత కుటుంబాలకు ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. శనివారం ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.2 వేల చొప్పున నగదు, 25 కిలోల చొప్పున బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత చింతలపాటి శ్రీనివాసరాజు, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, గ్రామ ఉప సర్పంచ్ కాగితరాజు తదితరులు పాల్గొన్నారు.

**పాడి రైతులకు ఉచిత దాణా పంపిణీ**

**అమలాపురం రూరల్:** వరద బాధిత ప్రాంతాల్లో పాడి రైతులకు ప్రభుత్వం అందించే ఉచిత పశువుల దాణా కిట్లను బండారులంక రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం అందించారు. ఒక్కో రైతుకు 25 కేజీల పశువుల దాణా కిట్లను శనివారం ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గుత్తుల జానకిలక్ష్మి, అంకం హిమ భారతి, వెటర్నరీ డాక్టర్ సాహిత్య గుప్తా, దంగేటి బుల్లబ్బులు, సరెళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌చే ఆధ్మాతిక చిత్రలేఖన పోటీలు



ఇస్కాన్ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

**అమలాపురం టౌన్:** అమలాపురం ఇస్కాన్ సెంటరు ఆధ్వర్యంలో స్థానిక మాచిరాజు వీధిలోని తటవర్తివారి కల్యాణ మండపంలో చిన్నారులకు మహాభారతం, రామాయణం, భాగవతాలకు సంబంధించిన చిత్రలేఖన పోటీలు శనివారం జరిగాయి. కృష్ణుడు, రాముడు తదితర దేవతామూర్తుల చిత్రాలను చిన్నారులు గీశారు. ఆదివారం ఇదే ఇతిహాసాలపై శ్లోకాల పోటీలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 7వ తేదీన జరగనున్న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులకు ముందస్తుగా ఈ పోటీలను నిర్వహించినట్లు ఇస్కాన్ అమలాపురం సెంటర్ ఇన్‌చార్జి శివానంద నిమయిదాస్ తెలిపారు. దాదాపు 400 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ స్థానిక సెంటరు ప్రతినిధులు మధురాతి సుందరీదేవి దాసి, సత్య జగన్నాథ దాస్, మురళీ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలందరూ విద్యా సంస్థల్లో నమోదు కావాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

**అల్లవరం:** 5 నుంచి 18 సంవత్సరాల వయసు గల పిల్లలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నమోదై ఉన్నారా లేదా అనే విషయాలను యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పిల్లల సర్వేపై వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు శిక్షణనిచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నమోదు కాని పిల్లలను గుర్తించి స్థానిక సర్పంచ్‌ల సహకారంతో వారిని పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కిరణ్ బాబు, ఏడుకొండలు, ఏఎల్ఎస్ఓ రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### సామాజిక తనిఖీపై ప్రజా వేదిక

**ఉప్పలగుప్తం:** 2022–2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో గత కొన్ని రోజులుగా 16వ విడత సామాజిక తనిఖీ చేసిన పనులపై డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ శుక్రవారం ప్రజా వేదిక నిర్వహించారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి అధ్యక్షతన శనివారం ఈ కార్యక్రమం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా 493 పనులను గుర్తించామని, రూ.7.2 కోట్లతో ఉపాధి పనులు, రూ.2.83 కోట్లతో పంచాయతీరాజ్ పనులు నిర్వహించామన్నారు. సామాజిక తనిఖీలో వివిధ పనులకు సంబంధించి రూ.4.50 లక్షల రికవరీకి ఆదేశించామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ కె.సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ సీహెచ్ నాగ సత్యనారాయణ, ఏపీవో వి.రాజామణి, ఏఈ వి.రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఇంజినీరింగ్ సహాయక సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

### వేధింపుల కేసులో ఐదుగురు అరెస్ట్

**తాళ్లరేవు:** ఇటీవల రామన్నపాలెంలో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసుకు సంబంధించి శనివారం ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామానికి చెందిన పోతాబత్తుల ధనలక్ష్మి వరకట్న వేధింపుల కారణంగానే తన కుమార్తె మహాలక్ష్మి మృతి చెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ డీఎస్పీ దర్యాప్తు చేశారన్నారు. దీనికి సంబంధించి పంతాడి నూకరాజు, పంతాడి చిన్న నూకరాజు, పంతాడి ధనలక్ష్మి, పంతాడి వెంకటేశ్వర్లు, ఓలేటి నర్సవేణిలను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని చెప్పారు.

### పిల్లలు వైకల్యంతో విద్యకు దూరం కాకూడదు

**అమలాపురం రూరల్:** ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వైకల్యంతో విద్యకు దూరం కాకూడదని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. శనివారం అమలాపురంలోని మండల వనరుల కేంద్రంలో జిల్లాలోని సహిత విద్యా విభాగంలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ ప్రత్యేక ఉపాధ్యాయులకు నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఎస్‌హెచ్‌ఆర్‌డీ తయారుచేసిన ప్రసస్తా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసేలా చూడాలన్నారు. పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీఎంఓ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఉర్దు మెయిన్‌ద్దీన్, ఏఈవో గుబ్బల సూర్యప్రకాష్, జిల్లాలో పనిచేస్తున్న 22 మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యంపై కేసు

**అమలాపురం రూరల్:** బండారులంక బ్యాంకు కాలనీకి చెందిన వివాహిత పడవల దేవి అదృశ్యంపై తాలూకా పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదని ఆమె భర్త పడవల వీర సుబ్బారావు అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్ఐ అందే పరదేశి తెలిపారు. ఆమె ఆచూకీ ఎవరికైనా తెలిస్తే అమలాపురం తాలూకా పోలీసులకు తెలియచేయాలని కోరారు.

### ఆక్రమణల తొలగింపు

**తాళ్లరేవు:** సుంకరపాలెం గ్రామంలో ఊటకాలువ భూఆక్రమణలు తొలగించాలని కోరుతూ గ్రామస్తులు దీక్షలు చేపట్టడంతో అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఈ ప్రాంతంలో ఉన్న మిగిలిన ఆక్రమణలను కూడా 15 రోజుల్లో తొలగించి పంచాయతీకి ప్రభుత్వ ఆస్తిని ఇస్తామని తహసీల్దార్ పోతురాజు చెప్పారని ఆందోళనకారులు గుత్తుల నాగేశ్వరరావు, వడ్డి ఏడుకొండలు విలేకర్లకు తెలిపారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా దీక్షలు చేస్తున్నవారికి ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు.

## చేపల మార్కెట్‌లో అసౌకర్యాల పరిశీలన



చేపల మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు తదితరులు

**అమలాపురం టౌన్:** స్థానిక చేపల మార్కెట్‌లో నెలకొన్న అసౌకర్యాలను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు శనివారం పరిశీలించారు. మార్కెట్‌లో చేపల వ్యర్థాలను, చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తొందరగా తొలగించకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని దుకాణాలు నిర్వహించే మత్స్యకారులు, స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ డస్ట్‌బిన్‌లు పాడైపోయాయని కొత్తవి ఇవ్వాలని మత్స్యకారులు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి హామీ ఇచ్చారు. మార్కెట్‌లో కట్టడాలకు చిన్న చిన్న మరమ్మతులు చేపట్టనున్నట్లు కమిషనర్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దొమ్మేటి రాము, వైఎస్సార్‌సీపీ నాయకుడు యండమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వుంగనూరు అల్లర్లకు చంద్రబాబే కారణం

**రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు జిన్నూరి బాబి**



**అమలాపురం టౌన్:** చిత్తూరు జిల్లా వుంగనూరులో టీడీపీ సృష్టించిన అల్లర్లు, దాడులకు చంద్రబాబు ముందస్తు వ్యూహమే కారణమని రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. శనివారం అమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో జరుగుతున్న అనూహ్య అభివృద్ధిని చూసి చంద్రబాబు అండ్ కో ఓర్చలేకపోతోందని అన్నా రు. చివరకు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ చిత్తుగా ఓడిపోయిన పరిణామాలను కూడా జీర్ణించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ అక్కసుతోనే చంద్రబాబు టూర్‌లో లేని వుంగనూరులోకి కావాలని మళ్లించి వ్యూహాత్మక దాడులకు తెగబడ్డారన్నారు. చంద్రబాబుకు వై కేటగిరీ భద్రత ఉండగా ఆ భద్రాధికారులు కూడా టూర్ షెడ్యూల్‌లో లేని వుంగనూరులోకి కావాలని వెళ్లి అల్లర్లకు దిగిన వ్యూహంలో ఆ అధికారుల వైఫల్యం, బాధ్యతారాహిత్యం ఉందని గుర్తుచేశారు. తొలుత ఈ అల్లర్లు, దాడులకు సంబంధించి చంద్రబాబు వ్యక్తిగత భద్రతా అధికారులపై విచారణ చేస్తే అసలు నిజాలు వెలుగు చూస్తాయని బాబి సూచించారు. వై కేటగిరీ భద్రతతో వెళ్లే చంద్రబాబు టూర్ షెడ్యూల్‌లో లేని ప్రాంతాలకు వెళ్లకూడదన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఈ వైఫల్యాలు, వ్యూహాత్మక చర్యలను గమనిస్తుంటే టీడీపీ శ్రేణుల ముందస్తు కుట్ర స్పష్టంగా తెలుస్తుందని బాబి అన్నారు.

## చేయూత మహిళా మార్ట్ దేశానికే ఆదర్శం

**హిమాచల్ ప్రదేశ్ అధికారుల బృందం అభినందన**



కోరంగిలో చేయూత మహిళా మార్ట్‌ను సందర్శించిన హిమాచల్‌ప్రదేశ్ అధికారుల బృందం

**తాళ్లరేవు:** మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ దేశానికే ఒక మోడల్‌గా ఉందని హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధుల మిషన్ (హెచ్‌పీఎస్ఆర్ఎల్ఎం) అధికారులు అభినందించారు. శనివారం మిషన్ సీఈఓ అనిల్ శర్మ, స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజత్ శర్మ, మిషన్ ఎగ్జిక్యూటివ్ రిషు మార్ట్ తాళ్లరేవు మండలంలో పర్యటించారు. తొలుత చినబొడ్డు వెంకటాయపాలెంలోని గోదావరి మహా సమాఖ్యను సందర్శించి మహిళా సభ్యులతో సమావేశమై వారి జీవన ప్రమాణాలు ఏవిధంగా పెరిగాయి అన్నదానిపై అధ్యయనం చేశారు. రాష్ట్రంలో అనుసరిస్తున్న బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, వీఆర్ఎఫ్ ద్వారా అందించే నిధులతో సభ్యులు ఏ విధమైన అభివృద్ధి సాధించారనే విషయంపై కాకినాడ జిల్లా డీఆర్‌డీఏ పీడీ రమణితో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం స్థానిక బాలయోగి కల్యాణ మండపంలో మహిళా సంఘాల సభ్యులచే నూతనంగా ప్రారంభించిన చేయూత మహిళా మార్ట్‌ను సందర్శించారు. మార్ట్ ఏర్పాటు, నిర్వహిస్తున్న విధానం లాభాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా సీఈఓ అనిల్ శర్మ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు చాలా బాగున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీపీఎంలు వీబీ రాయ్, టి.బాబూరావు, టి.అశోక్ భరత్, తాళ్లరేవు మండల ఏపీఎం రెడ్డి సన్యాసిరావు, సీసీ రఘురాం, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, మార్ట్ కమిటీ సభ్యులు డి.నూకరత్నం, యు.సునీత, మార్ట్ మేనేజర్ టి.మహేష్, జీఎంఎస్ మేనేజర్ కె.నరేష్, భీరావతి, దేవి పాల్గొన్నారు.

## ఆ దివ్యాంగురాలిది మొక్కవోని భక్తి



తన మూడు చక్రాల సైకిల్‌పై ప్రదక్షిణలు చేస్తూ ఏడు వారాల మొక్కు తీర్చుకుంటున్న దివ్యాంగురాలు

**అమలాపురం టౌన్:** కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధిగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో 7 శనివారాలు, 27 నక్షత్రాల ప్రదక్షిణలు చేసే భక్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. మండల కేంద్రం కాట్రేనికోనకు చెందిన దివ్యాంగురాలు సత్యవాణిది నడవలేని స్థితి. తన మూడు చక్రాల సైకిల్‌పై ఆలయానికి వచ్చింది. ఆ సైకిల్‌పైనే కూర్చుని ఆలయం చుట్టూ 7 శనివారాలు, 27 నక్షత్రాల ప్రదక్షిణలు చేసింది. ఆ ప్రదక్షిణల్లో నిమగ్నమై మొక్కవోని భక్తితో ఆమె ఆలయం చుట్టూ తిరిగిన దృశ్యాన్ని మిగిలిన భక్తులు ఆసక్తిగా తిలకించారు. అమలాపురానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాట్రేనికోన నుంచి ఆ దివ్యాంగురాలు ఆలయానికి వచ్చి ఏడు వారాల ప్రదక్షిణల మొక్కు తీర్చుకుంటోంది. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, అర్చకులు ఆమెకు ప్రదక్షిణల అనంతరం స్వామి దర్శనం ఏర్పాటుచేశారు.

# వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ గౌతమి



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి తదితరులు



గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ నాగ సుధారాణి

**అల్లవరం:** వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం లభిస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ కేపీఎల్‌డీ కుమారి ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా, బలవర్థకంగా ఉండాలంటే గర్భిణులు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించి స్వీట్లు, చీర, పండ్లు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీఓ కృష్ణమోహన్, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ ఎస్.మౌనిక, సూపర్‌వైజర్లు ఎస్.కుమారి, విజయభారతి, ఉన్నీషా తదితరులు పాల్గొన్నారు.

**గర్భిణులకు సీమంతం**

**అమలాపురం రూరల్:** గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇక నుంచి ఇంటి వద్దకే పౌష్టికాహారం అందిస్తుందని ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి అన్నారు. బండారులంకలోని 10 అంగన్వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, ఎంపీటీసీలు గుత్తుల జానకీలక్ష్మి, అంకం హిమభారతి, సెంట్రల్ డెల్టాబోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీను, కాలెపు శ్రీను, సరెళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

**వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ**

**అమలాపురం టౌన్:** స్థానిక 25వ వార్డు పరిధిలోని ఉప్పర కాలనీ అంగన్ వాడీ సెంటరు వద్ద గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోసణ పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. వార్డు కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు వేముల చిన్నా, దొంగ చిన్నా, గుత్తుల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా కిట్లు అందజేశారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కౌన్సిలర్ నాగ సుధారాణి ఆకాంక్షించారు.

## క్లుప్తంగా

### సహకార సంఘ మహిళా చైర్‌పర్సన్‌గా కల్యాణి



సహకార సంఘ మహిళా చైర్‌పర్సన్ కల్యాణిని సత్కరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దోలామణి తదితరులు

**అమలాపురం రూరల్:** ఇందుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ తొలి మహిళా చైర్‌పర్సన్‌గా జొన్నవిత్తుల కల్యాణి శనివారం సంఘ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చైర్‌పర్సన్ కల్యాణితో పాటు డైరెక్టర్లుగా యనమదల వినయ్‌కుమార్, బొంతు రామచంద్రరావులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొంతు గోవిందుశెట్టి, సర్పంచ్‌లు చొల్లంగి శివాణిని, గుత్తుల చిరంజీవి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ తదితరులు అభినందించి సత్కరించారు.

### నూతన వలంటీర్లకు నియామక పత్రాలు



వలంటీర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

**అల్లవరం:** మండలంలోని కొమరగిరిపట్నం, ఓడలరేవు, అల్లవరం, బెండమూర్లంక గ్రామాల్లో నూతనంగా నియమించిన 10 మంది వలంటీర్లకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు నియామక పత్రాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ కేటాయించిన 50 కుటుంబాల పరిధిలోని లబ్ధిదారులకు పారదర్శకంగా సేవలందించాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ మౌనిక, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ లక్ష్మణరావు, కొనుకు మహేష్ పాల్గొన్నారు.

### వలంటీర్ ఔదార్యం



విజయవాడలో మంగాయమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బాబు

**ఉప్పలగుప్తం:** అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఇండియాల మంగాయమ్మకు వలంటీర్ కటికిదాల బాబు అక్కడకు వెళ్లి శనివారం పింఛన్ అందజేశాడు. ఈ సందర్భంగా ఆయనను సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు అడపా రమేష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయకుమార్ అభినందించారు.

### స్టేట్‌హుడ్ కోసం విన్నవించాలని నిర్ణయం

**యానాం:** పుదుచ్చేరికి రాష్ట్ర ప్రతిపత్తిని మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు వినతిపత్రం ఇవ్వాలని పలు సామాజిక స్వచ్ఛంద సంస్థలు నిర్ణయించాయి. ఈ మేరకు సమావేశం ఎమ్మెల్యే జి.నెహ్రూ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఇప్పటికే పలుసార్లు స్టేట్‌హుడ్‌పై అసెంబ్లీలో తీర్మానం చేశారని, అయితే ఆ తీర్మానాన్ని ఎల్జీ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని పలువురు వక్తలన్నారు. అందుకే త్వరలో పుదుచ్చేరిలో పర్యటించనున్న రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు.

### ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

**ముమ్మిడివరం:** ఎరువులు, పురుగుమందుల వినియోగంపై రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ అన్నారు. శనివారం ఆయన వివిధ గ్రామాల్లో పర్యటించి ఖరీఫ్ సాగు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పంటలపై అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయకూడదన్నారు. ఎరువులు, గుళికలు వేసేటప్పుడు పొలంలో నీరు తక్కువగా ఉండేలా జాగ్రత్త పడాలన్నారు.

### విద్యుత్ ప్రైవేటీకరణకు దశల వారీ చర్యలు

**యానాం:** పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్‌ను ప్రైవేటీకరణ కోసం రిక్వస్ట్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ)ను అమలుచేసేందుకు దశలవారీ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్‌కే సింగ్ తెలిపారు. విద్యుత్ ప్రైవేటీకరణపై శనివారం ఎంపీ వైద్యలింగం అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. పలు విద్యుత్ యూనియన్ల విన్నపాల మేరకు షేర్‌ల పంపకంలో మార్పులు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమ్మకాలకు సంబంధించిన వాటా పర్సంటేజ్‌లో 100 శాతం నుంచి 51 శాతం వరకూ మార్పులుంటాయన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పలు విద్యుత్ యూనియన్లు మద్రాసు హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశాయని, వాటికి పరిపాలనా శాఖ కౌంటర్ దాఖలు చేస్తుందన్నారు.

### బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

**తాళ్లరేవు:** జి.వేమవరం పంచాయతీలో ముగ్గురు మైనర్ బాలికల వివాహాలకు చేస్తున్న ప్రయత్నాలను అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలికలకు నిశ్చితార్థం చేస్తున్నారని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు అందిన సమాచారం మేరకు ఐసీడీఎస్ విస్తరణాధికారి గ్రేడ్‌వన్ లలితా నిర్మల, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ తదితర సిబ్బంది మైనర్ బాలికల ఇళ్లకు వెళ్లి నిశ్చితార్థ కార్యక్రమాలను నిలిపేయించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలను ఆయా కుటుంబ సభ్యులకు వివరించారు. గ్రామ పెద్దలు పి.సూరిబాబు, గండి రామాంజనేయులు సమక్షంలో 18 ఏళ్లు నిండే వరకూ వివాహం చేయమని వారి వద్ద నుంచి అంగీకార పత్రం తీసుకున్నారు.

### ఇండోర్ స్టేడియం మరమ్మతుల పరిశీలన

**యానాం:** యానాంలో ప్రతిష్టాత్మకమైన డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం రూఫ్ సీలింగ్‌కు జరుగుతున్న మరమ్మతుల పనులను ఆర్ఏఓ మునిస్వామి శనివారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేయాలని ఆయన అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇండోర్ స్టేడియం రూఫ్ నుంచి లోపలకు వర్షపు నీరు వస్తుండటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక క్రీడాకారుల ఫిర్యాదు మేరకు రూఫ్ సీలింగ్ మరమ్మతుల పనులను పీడబ్ల్యూడీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

**యానాం:** దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా పుదుచ్చేరి అగ్నిమాపక శాఖలో వివిధ ఉద్యోగాలకు సంబంధించి మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు సివిల్ సప్లయిస్ మినిస్టర్ జె.శర్వణన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అగ్నిమాపక దళంలో మొత్తం 75 పోస్టుల్లో 2 ఆఫీసర్స్, 19 ఫైర్‌మెన్ పోస్టులను మహిళలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. చదువుకున్న మహిళా అభ్యర్థులకు ఇది మంచి సదావకాశమని చెప్పారు. 44 వేల మంది అర్హులకు ఎరుపురంగు రేషన్‌కార్డు(బీపీఎల్)ను మంజూరు చేశామన్నారు. యానాంలో 2 వేల అనర్హుల కార్డులను తొలగించామన్నారు.

### రైతుల సేవలో రైతు భరోసా కేంద్రాలు

**కాట్రేనికోన:** గ్రామ స్థాయిలో రైతులకు అవసరమైన సేవలను రైతు భరోసా కేంద్రాలు అందిస్తున్నాయని వ్యవసాయ అధికారి కె.ప్రవీణ్ తెలిపారు. కందికుప్ప రైతు భరోసా కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలచే సాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సాగులో అధిక దిగుబడులు వచ్చే రకాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు స్వప్న, సుధ, అంజలి, ప్రకాష్, సత్యనారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**కాట్రేనికోన:** మండలంలోని గెద్దనపల్లి పంచాయతీ బక్కివారిపేటలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన గెద్దాడ రవిశేఖర్ కుటుంబ సభ్యులను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. మృతుడు రవిశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిబద్ధత గల కార్యకర్తను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు కోరుకుకొండ నారాయణ, ఎంపీటీసీ మోతా రామలక్ష్మి, కొవ్వూరి బుల్లిరాజు తదితరులున్నారు.

### ఎమ్మెల్సీ సంతాపం

**అమలాపురం టౌన్:** అమలాపురం ఆర్టీసీ యూనియన్ నాయకుడు యల్లమిల్లి రమేష్ మృతికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సంతాపం తెలిపారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన రమేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు శనివారం పరామర్శించారు. ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కార్యదర్శి సానబోయిన రామారావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్, వాసర్ల సుబ్బారావు, రాయుడుగోపితదితరులు ఉన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం

**ఉప్పలగుప్తం:** మండలంలో మూడు దశాబ్దాల పాటు పీఎంపీగా వైద్య సేవలు అందించిన తోట సత్యనారాయణ జయంతి పురస్కరించుకుని వారి కుటుంబసభ్యులు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కూనవరంలో సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు జి.రమేష్, వరలక్ష్మి, రాకేష్ వైద్య సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ కొంకి ఏడుకొండలు, సొసైటీ ఊటాల రామాంజనేయులు, పినిపే జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మెగా వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది